www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 ఆగస్టు 2025
5
కాకినాడ



హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా దుర్గారావు



ప్రజాశక్తి - రౌతులపూడి

డిఎస్‌సి-2025 ఫలితాలలో మండలంలోని బలరాంపురం గ్రామానికి చెందిన దడాల దుర్గారావు హిందీ ఫలితాల్లో విజయం సాధించారు. సాధారణ కూలీ కుటుంబంలో జన్మించిన దుర్గారావు తల్లిదండ్రులు నాగమణి, కృష్ణ, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ పరీక్షలో ఉత్తమంగా రాణించాడు. ఎస్ఎ హిందీలో జిల్లాలో రెండో ర్యాంకు సాధించి, టిజిటి హిందీలో జోన్2లో ఎనిమిదో ర్యాంకు సాధించాడు. దుర్గాప్రసాద్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ శిక్షణ లేకుండా చదివి లక్ష్యాన్ని చేరుకుని తల్లిదండ్రుల కలలను నెరవేర్చాడు. 2018 డిఎస్‌సి పరీక్షలు రాసినప్పటికీ ఎంపిక కాలేదు. అయినా పట్టువీడకుండా నేడు విజయం సాధించాడు. ఉత్తమ విజేతగా నిలిచిన దుర్గారావును పలువురు అభినందించారు.

ఆక్వా నెత్తిన ట్రంప్ సమ్మెట

- కుదేలైన ఆక్వా రంగం
- జిల్లాలో తగ్గిన రొయ్యల ఎగుమతులు
- ఇప్పటికే పతనమైన ధరలు



ప్రజాశక్తి - రాజోలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకం బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని తీర ప్రాంత మండలాల్లో వనామీ రొయ్యల సాగు అధికంగా సాగు అవుతోంది. ప్రస్తుతం మొదటి పంట పూర్తయి, రెండో పంటకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో 85 వేల ఎకరాల్లో సాగు..

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో చేపలు, రొయ్యలు 2.80 లక్షల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. దీనిలో 80 వేల ఎకరాల్లో రొయ్య పంట సాగులో ఉంది. అధికంగా కోనసీమ జిల్లాలో 45 వేల ఎకరాల వరకు సాగులో ఉండగా, మిగిలిన భాగం కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఉంది.

మరో మూడు నెలల్లో పంట చేతికి..

మరో రెండు మూడు నెలల్లో రైతుల వద్ద పంట ఉంటుంది. ఇటువంటి తరుణంలో తాజాగా అమెరికా సుంకాల దెబ్బ ఎంతవరకు ఉంటుందనే ఆవేదన రైతుల్లో వ్యక్తం అవుతోంది. మార్చి నెలలో రోజుకు రూ.10 చొప్పున ధర పడిపోవడంతో రైతులు మానసిక ఆవేదనకు గురయ్యారు. ప్రస్తుతం వంద కౌంట్‌ రూ.240ల వరకు కొంటున్నారు. రైతుల వద్ద పంట చేతికి వచ్చే సమయంలో సుంకాలు అమలు చేస్తే తిరిగి గతంలో మాదిరిగానే వంద కౌంట్ ధర రూ.200లకు పడిపోయే అవకాశం ఉందని అధికారులు ట్రేడ్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. దీంతో రైతులు పెట్టుబడి రాని పరిస్థితి నెలకొందని ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం వనామీ 100 కౌంట్ ధర రూ.270 ఉండగా ప్రస్తుతం రూ.225కు తగ్గింది. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ.680 ఉండగా ప్రస్తుతం 570కి తగ్గింది. ఈ లెక్కన నెల రోజుల్లో వనామీ ధర రూ.45, టైగర్ ధర రూ.100 తగ్గింది. దీనివల్ల లాభాల సంగతి దేవుడెరుగు పెట్టుబడులు వచ్చే పరిస్థితి కన్పించడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

డాలర్ పంట డమాల్...!

డాలర్ పంటగా పేరొందిన ఆక్వా సాగుకు కొన్నాళ్లుగా గడ్డుకాలం ఎదురైంది. పెరుగుతున్న లీజులు, చేయి దాటుతున్న పెట్టుబడులు, దిగజారుతున్న ధరలు, ఆకాశాన్ని అంటుతున్న దాణా, మందుల ధరలు, చుట్టుముడుతున్న వ్యాధులు ఆక్వా రైతులపై మూకుమ్మడి దాడి చేస్తున్నాయి. తాజాగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల దెబ్బకు ఆక్వా రంగం మరింత పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవటంతో ధరలు రోజురోజుకు పతనమైపోతున్నాయి. చేతికొచ్చిన పంటను నిల్వ చేయలేని స్థితి. తక్కువ ధరకు అమ్ముకుంటే కష్టానికి కనీసం ప్రతిఫలం కూడా రాని పరిస్థితి నెలకొంది. 15 ఏళ్ల కిందట వరకు రొయ్యల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించేవారు. ఎకరా చెరువులో 30-40 వేల మధ్య పిల్లలను వేసేవారు. ఏరియేటర్లకు డీజిల్ ఇంజిన్లు వినియోగించేవారు. మేత ధరలు టన్ను రూ.30-40 వేల మధ్య ఉండేది. లీజులు ఎకరాకు రూ.20-40 వేల మధ్య ఉండేది. వ్యాధుల బాధ తక్కువగా ఉండేది. దీంతో సులభంగా 30-40 కౌంట్‌లు వచ్చేవి. అప్పట్లో 40 కౌంట్ ధరలు రూ.400 వరకు ఉండటంతో రైతులకు లాభాల పంట పండేది. ప్రస్తుతం ఎకరాకు 1.50 లక్షల పిల్లలను వదులుతున్నారు. విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, బిల్లులు అధికంగా అవుతున్నాయి. టన్ను మేత ధర రూ.80 వేలు అయింది. ఇంక చెరువుల్లో వదిలే రొయ్య పిల్లల సంఖ్య 3 రెట్లకు పెరగడంతో అదే రీతిలో మేత వేయాల్సి వస్తోంది. దీంతో ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి. లీజు ఎకరాకు రూ.1.50 లక్షల వరకు చేరింది. ఇంక వ్యాధుల సంగతి అయితే చెప్పనవసరం లేదు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు..!

ఏప్రిల్ 3న అమెరికా పన్నుల పెంపు ప్రకటనను సాకుగా చూపించి కిలోకు 30 కౌంట్‌కు రూ.460, 40 కౌంట్కు రూ.370, 100 కౌంట్కు రూ.230 ఉన్న ధరలను ప్రాసెసింగ్ ప్లాంట్ల నిర్వాహకులు, ఎక్స్‌పోర్టర్స్, వ్యాపారులు రూ.30 నుంచి రూ.70 వరకు తగ్గించేశారు. రొయ్యల సాగు పెట్టుబడులు ఏడాది కేడాదికి పెరుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు రెట్టింపవగా, జీవ రసాయన మందుల ధరలు అయాంతం పెరిగాయి. పెరిగిన వర్కర్స్ జీతాలు దీనికి తోడయ్యాయి. దీంతో ఎకరం రొయ్యల సాగుకు రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల ఖర్చవుతోంది. ఈ లెక్కన పెట్టుబడులు రావాలంటే వనామీ 100 కౌంట్ కౌలు రైతు అయితే రూ.250 అమ్మాలి. సొంత రైతు అయితే రూ.225 అమ్మాలి. కానీ ప్రస్తుతం ధరలు అంతకు మించి తగ్గాయి.

ఎకరాకు రూ.లక్షపైనే నష్టం..!

రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి 2 టన్నులు దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడం లేదు. ఈ లెక్కన ఉన్న ధరతో ఎకరాకు రూ.3.50 లక్షలకు మించి రాబడి ఉండడం లేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతు రూ. 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఎకరం కౌలు చెరువులను బట్టి రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష ఉంది. కౌలు రైతులకు వడ్డీలు అదనపు భారంగా మారనున్నాయి.

పరిశ్రమపై ప్రభావం

ఈ సంక్షోభం కేవలం రైతులకే పరిమితం కాలేదు. దీని ప్రభావం మొత్తం సరఫరా గొలుసుపై పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 100-150 ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు, ముఖ్యంగా విశాఖ పరిసర ప్రాంతాల్లోని 15 ఫ్యాక్టరీలు ఎగుమతి ఆర్డర్లు లేక ఉత్పత్తిని భారీగా తగ్గించాయి. దీని వల్ల వేలాది మంది కార్మికులు, ముఖ్యంగా మహిళలు ఉపాధి కోల్పోయే ప్రమాదం ఏర్పడింది.

ట్రంప్ సుంకాల బూచి చూపి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. వాస్తవానికి 100 కౌంట్ రొయ్య అమెరికాకు వెళ్లదు. కేవలం 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అమెరికాకు రొయ్య ఎగుమతి కాకుండానే ఎగుమతిదారులు, వ్యాపారులు ట్రంప్ సుంకాల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ధరలు తగ్గించి రొయ్య రైతును దోపిడీ చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమెరికాతో దౌత్య, వాణిజ్యపరమైన చర్చలు జరిపి, సుంకాలను తగ్గించేలా లేదా పూర్తిగా తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలి. నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలి. విద్యుత్, రొయ్యల మేత వంటి కీలకమైన వాటిపై సబ్సిడీలను పెంచి, సాగు వ్యయాన్ని తగ్గించాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించకపోతే.. రాబోయే సీజన్‌లో రొయ్యల సాగుపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది పరిశ్రమ భవిష్యత్తును మరింత ప్రమాదంలోకి నెడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



అభినందన సభ లో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి బేబీరాణి

పోరాడిన మినీ వర్కర్లకు జేజేలు

ప్రజాశక్తి - కాకినాడ

అంగన్‌వాడీ మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని పోరాడి విజయం సాధించిన అంగన్‌వాడీలకు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, సిఐటియు జిల్లా కోశాధికారి మలక వెంకటరమణ జేజేలు పలికారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో యూనియన్ నాయకురాలు బి.బాంధవి అధ్యక్షతన విజయోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాటాల ద్వారానే ఫలితాలు వస్తాయని మినీ అంగన్‌వాడీ వర్కర్లు నిరూపించారని అన్నారు. భవిష్యత్తులో మిగిలిన సమస్యలపై పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఏళ్ల తరబడి టీచర్లు, హెల్పర్ల పనిని మినీ వర్కర్లు ఒక్కరే చేసే వారని అన్నారు. వేతనం మాత్రం హెల్పర్లకు ఇచ్చే వేతనమే చెల్లించేవారని తెలిపారు. అనేక ఇబ్బందులు పడుతూ సెంటర్లను నిర్వహణ చేస్తూ వచ్చారని, మరోపక్క మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా మార్పు చేయాలని పోరాటాన్ని కొనసాగించారని అన్నారు. 2024లో 42 రోజులు పాటు చేసిన సమ్మె ఫలితంగా ఈ విజయం వచ్చిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంపుదలకు మరో పోరాటానికి సిద్ధపడుతున్నామన్నారు. గ్రాడ్యుటి జిఒ మార్పు కోసం, మిగిలిపోయిన 1810 మంది మినీలను మెయిన్ సెంటర్స్‌గా వెసులుబాటు ఇచ్చి మారుస్తామన్నారని అన్నారు. ఈ మార్పు జరిగే వరకు పోరాటాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వసుధ, లోవమ్మ, ప్రసన్నకుమారి, బి.రాజమ్మ, దుర్గాదేవి, సత్యవేణి, సునీత, అప్పలరాజు, శరణ్య, నాగ సురేఖ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటా: ఎంపీ

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని మత్స్యకారులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని ఎంపి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం యు.కొత్తపల్లి మండలానికి చెందిన మత్స్యకార సంఘాల నాయకులు ఎంపిని కలిశారు. మండలంలోని ఉప్పాడ, అమీనాబాద్, కోనపాపపేట, మూలపేట తదితర గ్రామాలు చెందిన మత్స్యకారులు వేటకు వెళ్లి కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం చినగొల్లపాలెం, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది నరసాపురం ప్రాంతాల వద్ద తమ మత్స్య సంపదను అన్ లోడింగ్ చేసుకుంటుంటే స్థానిక మత్స్యకారులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తు న్నారని తెలిపారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన మచిలీపట్నం ఎంపీ బాలసౌరి, రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌లతో ఫోన్లో మాట్లాడి అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. అలాగే అమీనాబాద్ హార్బర్ వద్ద రోడ్డును నిర్మించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఎంపి నిధులతో రోడ్డును అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్, జనసేన జిల్లా అధ్యక్షులు తుమ్మల బాబు, మత్స్యకార సంఘాల నాయకులు విజయ్‌కుమార్, చినబాబు, సురాడ నాగేశ్వరరావు, మరడ కొండయ్య, చోడిపల్లి చిట్టిబాబు, ముడి జగన్నాథం పాల్గొన్నారు.



మత్స్యకార సంఘ నాయకులతో ఎంపి ఉదయ్

విజయవంతంగా జెవివి జిల్లా మహాసభ

ప్రజాశక్తి - కాకినాడ

జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభలు విజయవంతంగా జరిగాయి. ఆదివారం స్థానిక యుటిఎఫ్ హోంలో జరిగిన మహాసభలో తొలుత జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు వి.సత్యనారాయణరెడ్డి జెవివి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గత రెండేళ్ల కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పరిశీలకులు కె.త్రిమూర్తులు మాట్లాడుతూ సమాజంలో జెవివి ఆవశ్యకత ఎన్నడూ లేనంతగా నేడు పెరిగిందని అన్నారు. నూతన కమిటీ అందుకు అనుగుణంగా కార్యక్రమాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిబాబు, ఎపిఆర్ఎంఎస్ఎ రాష్ట్ర అధ్యక్షులు కె.సత్తిరాజు, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి రమణి సౌహార్ద సందేశాలు ఇచ్చారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జెవివి నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కెఎంఎంఆర్.ప్రసాద్, జిఎస్‌హెచ్.ప్రసాద్‌వర్మ, కోశాధికారిగా పి.బాలాజీ, కమిటీ సభ్యులుగా పలువురు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



జనవిజ్ఞాన వేదిక జిల్లా నూతన కార్యవర్గం

పిపిపి విధానంలో ఆసుపత్రి నిర్వహణ తగదు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురంలో వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తామని సిఎం చంద్రబాబు నాయుడు చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, అయితే ఆ ఆసుపత్రిని పిపిపి పద్ధతిలో నిర్వహిస్తామనడం తగదని సిపిఎం జిల్లా నాయకుడు నీలపాల సూరిబాబు అన్నారు. ఆదివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిని ప్రయివేటీకరించటమే లక్ష్యమన్నట్లు సిఎం చంద్రబాబు ప్రకటన ఉందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నిర్వాహణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. రామేశ్వరం మెట్ట వద్ద 11 గ్రామాల ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, అదే ప్రదేశంలో రూ.330 కోట్లతో చెత్త నుంచి విద్యుత్ తయారు చేసే ప్లాంట్ పెడతామని ప్రకటించడం దారుణమన్నారు. ఈ ప్లాంట్ వల్ల సమీపంలోని గ్రామాల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే పరిశ్రమ అనపర్తి, బిక్కవోలు ప్రాంతాల్లో పెట్టడానికి ప్రయత్నిస్తే ఆ ప్రాంత ప్రజలు పర్యావరణాన్ని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యతిరేకించారని, అటువంటి పరిశ్రమను ఇక్కడ పెట్టడం అన్యాయ మన్నారు. మున్సిపల్ కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించిన ముఖ్యమంత్రి మున్సిపల్ సిబ్బంది సంఖ్యను పెంచాలన్నా సంగతిని మరచిపోయారన్నారు. ఏలేరు నుంచి పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా చేస్తామనడం సంతోషదాయకమన్నారు. ప్రజల కోసం ఉపయోగపడే ప్రాజెక్టులకు, పథకాలకు సిపిఎం మద్దతు ఇస్తుందన్నారు. పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే వాటిని సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు సిరపరపు శ్రీనివాస్, రొంగల వీర్రాజు, చల్లా విశ్వనాథం, ఆర్.సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకుడు సూరిబాబు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ గ్రీవెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కు రాలేని అర్జీదారులు వారి అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీల నమోదు, వాటి యొక్క స్థితిని తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేయవచ్చని తెలిపారు.

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మెయిన్ రోడ్డులోని తాళ్లూరి వారి సత్రంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రొటేరియన్స్ జిఎస్‌వి.రావు, కెఎస్ఆర్‌కె.చౌదరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో పెద్దాపురం రోటరీ బ్లడ్ బ్యాంక్ సహాయ సహకారాలతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యవంతమైన యువత రక్తదానం చేసి ఇతరుల ప్రాణాలు నిలపాలన్నారు.

ఎపిఎస్‌పి క్యాంప్‌లో సండే ఆన్ సైకిల్

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎపిఎస్‌పి 3వ బెటాలియన్ క్యాంప్‌లో సండే ఆన్ సైకిల్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమాండెంట్ ఎం.నాగేంద్రరావు పాల్గొని మాట్లాడారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రతి ఆదివారం సైక్లింగ్, యోగ, స్కిప్పింగ్, జుంబ డాన్స్ మొదలగు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎస్.దేవానందరావు, అసిస్టెంట్ కమాండెంట్లు బి.చంద్రశేఖర్, మోహన్‌రావు, ఆర్ఐలు అజయ్‌కుమార్, విఠలేశ్వరరావు, మురళీమోహన్‌రావు, రాము, హరిబాబు, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షునిగా శ్రీనివాస్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట రూరల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా వేము శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని వేట్లపాలెం గ్రామంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు తోట సూర్యసుబ్బారావు ఆధ్వర్యంలో రూరల్ అసోసియేషన్ ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వేము శ్రీనివాసు, కరక రామకృష్ణ, కోశాధికారిగా పేకేటి శేషుబాబు, ఉపాధ్యక్షుడిగా జిత్తుక శేఖర్, సహాయ కార్యదర్శిగా ఆడపా వెంకీ, సభ్యులుగా పాలిక జయబాబు, మేడిశెట్టి లోవరాజు, పలివెల వెంకటరమణ, రెడ్డిమల్లి జానీ, ద్వారంపూడి వీరేంద్ర ఎన్నికయ్యారు. వీరితో జిల్లా అధ్యక్షుడు సూర్యసుబ్బారావు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వాహన తనిఖీలు

ప్రజాశక్తి - కాజులూరు, యు.కొత్తపల్లి

మండలంలోని కోలంక శివారులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ తనిఖీల్లో ఎస్ఐ మోహన్‌కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో గుర్తించిన వారికి జరిమానాలు విధించడం జరుగుతుందని అన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు లైసెన్స్ లేకుండా వాహనాలు ఇచ్చినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

బీచ్ రోడ్‌లో...

ఉప్పాడ - కాకినాడ బీచ్ రోడ్‌లో సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ద్విచక్ర వాహనాలను తనిఖీలు చేశారు. బీచ్ రోడ్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదుతో పాటు సరైన పత్రాలు, హెల్మెట్ లేకుండా నడుపుతున్న వాహనదారులకు అవగాహన కల్పించారు. పర్యాటకల తాకిడి అధికంగా ఉండడంతో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ నియమించిన అధికారులు, అనువంశిక ధర్మకర్త చింతపల్లి శ్రీహర్ష, కమిటీ సభ్యులు, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిచి లెక్కింపు జరుపుతారన్నారు. అలాగే అమ్మవారికి సమర్పించిన కోళ్లు, మేకలు, ఎనుపోతులు అమ్ముకునే హక్కు, యాత్రికుల నుంచి తీసుకునే హక్కు, కొబ్బరికాయలలో సగభాగం తీసుకునే హక్కుకు సంబంధించి టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామని తెలిపారు.

చదువు కోసం మణికర్ణిక బృందం సాయం

ప్రజాశక్తి - జగ్గంపేట

ఆడబిడ్డ చదువు కోసం మణికర్ణిక యువజన సంఘం సభ్యులు ఆదివారం ఆర్థిక సాయాన్ని అందించారు. సంఘం సభ్యులు మానేపల్లి రాజేష్ పుట్టినరోజు సందర్భంగా కొత్తపల్లి గ్రామానికి చెందిన ఒనిమిశెట్టి విశాలి ఇంజినీరింగ్ చదువు నిమిత్తం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మణికర్ణిక బృందం అధ్యక్షులు గున్నాబత్తుల అనూష, సభ్యులు రమేష్, నాని వీరబాబు, ఎస్‌సి బాలుర హాస్టల్ వార్డెన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



విద్యారంగంలో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

విద్యారంగంలో ఉన్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అమలు చేయకపోవడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.6400 కోట్లు ఉన్నాయని గుర్తు చేశారు. తల్లికి వందనం పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు కాస్మోటిక్, మెస్ ఛార్జీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని ఆయన కోరారు. ప్రత్తిపాడులో జూనియర్, డిగ్రీ ప్రభుత్వ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే జిఒ నెంబర్ 77 రద్దు చేయాలన్నారు. అనంతరం తహాశీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సిద్ధు, మండల కార్యదర్శి నరసింహ, మండల నాయకులు శివమణి, భానుబాబు, నాని, అశోక్, హరి, పండు, వంశి, రాణి, అనూష, విద్యార్థులు పాల్గొన్నారు.



తహాశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్



త్రిరత్న బౌద్ధ దమ్మ సంఘం నూతన కార్యవర్గం

బౌద్ధ దమ్మ సంఘం కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండల త్రిరత్న బౌద్ధ దమ్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. ఉపాసకులు నరసింహమూర్తి, శ్రీరాములు సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నూతన అధ్యక్షులుగా జక్కల ప్రసాద్‌బాబు, కార్యదర్శిగా గుత్తాల సుబ్రహ్మణ్యం, ట్రెజరర్‌గా పినిపే నాగేంద్రరావు, ఉపాధ్యక్షులుగా కూరాటి రామారావు, సహాయ కార్యదర్శిగా పొనుగుమట్ల రత్నప్రభ, మరో పదిమంది సభ్యులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీతో ఉపాసకులు నరసింహమూర్తి ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన బౌద్ధ దమ్మ సభ్యులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - గండేపల్లి

వినాయక ఉత్సవాలకు సంబంధించి ముందస్తు జాగ్రత్తలు అవసరమని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి మండపాలు, పందిళ్ల ఏర్పాటు చేయడానికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అనుమతుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానాన్ని అనురించాలని సూచించారు.

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి- సామర్లకోట

భీమేశ్వర ఆలయ అన్నదాన ట్రస్ట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన కీర్తిశేషులు జోస్యుల వెంకట సోమయాజులు జ్ఞాపకార్థం ఆయన సతీమణి జోస్యుల సుబ్బలక్ష్మి రూ.50,014 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి తీర్థప్రసాధాలు, స్వామి చిత్రపటం అందజేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వృద్ధుని దుర్మరణం

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు దుర్మరణం చెందాడు. ఎస్ఐ సిహెచ్.రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వానపల్లిపాలెంకు చెందిన కోలా వీరరాఘవులు(75) ఆదివారం ఉప్పలగుప్తం నుంచి వానపల్లిపాలెం సైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి ఐషర్ వ్యాన్ ఢీకొంది. ఈ ఘటనలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాడుతున్న 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని కె.గంగవరం రైల్వే ట్రాక్ వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.4 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జానీబాషా తెలిపారు.

చెల్లిని చూసేందుకు వచ్చి..

ప్రజాశక్తి - గోపాలపురం

చెల్లిని చూసేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని సాగిపాడు శివారులో ఆదివారం చోటు చేసుకుంది. మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. కొవ్వూరు మండలం తోగుమ్మికి చెందిన ముప్పిడి నరేష్(26) అత్తారింటిలో ఉన్న తన చెల్లిని చూసేందుకు గుడ్డిగూడెం వచ్చాడు. సాగిపాడులో ట్రక్ ఆటో బలంగా ఢీకొట్టడంతో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన బాలును గోపాలపురం సిహెచ్‌సికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ఒక ప్రయివేట్ హాస్పిటల్‌కు తరలించారు. నరేష్ తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని జె. కొత్తూరు శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు. వారి నుంచి రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున యాత్రికులు పాల్గొన్నారు. దాతల ఆర్థిక సాయంతో అన్నదానం కార్యక్రమాన్ని ప్రతీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఎసి విజయలక్ష్మి తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వేద పండితులు ఐవి.ప్రసాద్‌శర్మ, ఎన్‌వి.అవధాని, శంకర్, ఆశాధులు రాయి నాని, రామచంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

చవితి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఆలమూరు

వినాయక చవితి ఉత్సవాలు ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో కమిటీ సభ్యులు నియమ నిబంధనలు పాటించాలని ఎస్‌పి జి.నరేష్ తెలిపారు. చెముడులంక శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో వినాయక చవితి వేడుకలకు ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా కమిటీ సభ్యులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడు తూ మండపాలకు పోలీస్ అనుమతి తప్పని సరిగా ఉండాలన్నారు. లౌడ్ స్పీకర్లకు సాయం త్రం 6 నుంచి రాత్రి 10 వరకు మాత్రమే అనుమతి ఉంద న్నారు. డీజేలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేద న్నారు. మండపం లో అగ్ని ప్రమాదాలు విద్యుత్ భద్రత చర్యలు తప్పకుండా ఉండాల న్నారు. బాణసంచా పేల్చేందుకు అనుమతి లేదన్నారు. మద్యం సేవించి అల్లర్లకు దిగి ప్రజలకు అసౌకర్యాన్ని కలిగించినా ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు నాగిరెడ్డి వెంకటరత్నం, నాగిరెడ్డి సత్యానందం, గుండుమల్ల రాంబాబు, కొత్తపల్లి రాంబాబు, సిరంగుల సతీష్ పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపిడిఒగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి - రావులపాలెం

రావులపాలెం డిప్యూటీ ఎంపి డిఒగా ఎం.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన రాయవరం మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన జి.కృష్ణ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఈ పోస్టు ఖాళీ అయింది. బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస రావు మాట్లాడుతూ రావులపాలెం మండల పరిధిలో అన్ని గ్రామ పంచాయ తీలపై అవగాహన కలిగించుకుని మౌలిక సదుపా యాలు సక్రమంగా నిర్వహించేందుకు కృషి చేస్తానని ఇచ్చారు. శ్రీనివాసరావుకు పంచా యతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

29న పవర్ లిఫ్టింగ్ పోటీలు

ప్రజాశక్తి - అమలాపురం

నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా ఈనెల 29న ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ అమలాపురంలో 4వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ పోటీల ను జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించి ఛాంపి యన్షిప్ ట్రోఫీలను ఒలింపిక్ మెడల్స్‌ను ఆదివారం ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్ నందు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లాడ శరత్‌బాబు ఆవిష్కరించారు. జిల్లా ఒలింపిక్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పప్పుల శ్రీరామ్ చంద్రమూర్తి మాట్లాడుతూ ఈపో టీలను సబ్-జూనియర్, సీనియర్, మాస్టర్స్ (పురు షులు, మహిళలు) విభాగాల్లో 30 క్యాట గిరీల్లో నిర్వహించి, విజేతలకు మెరిట్ సర్టిఫికెట్స్, ఒలింపిక్ మెడల్స్‌ను, ఛాంపియ న్షిప్ ట్రోఫీలు, నగదు బహుమతులను అంద జేస్తారన్నారు. కార్యక్ర మంలో జిల్లా ఒలింపిక్ అసోసి యేషన్ సెక్రెటరీ డాక్టర్ గోకరకొండ నాగేంద్ర, వైస్ ప్రెసిడెంట్ కల్వకొలను బాబు, జిల్లా బాడీ బిల్డింగ్ అసోసి యేషన్ ఉపాధ్య క్షులు గారపాటి చంద్రశేఖర్, ఈ పోటీలకు ఛాంపియన్ ట్రోఫీల స్పాన్సర్ అమలాపురం వైస్ ఎంపిపి అడపా వెంకటసుబ్రహ్మణ్యం, అమలాపురం టౌన్ టిడిపి లీడర్ ఆశెట్టి ఆది బాబు పాల్గొన్నారు.

వేగవంతంగా రీ సర్వే

ప్రజాశక్తితో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆర్‌జెడి కుమార్



ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రీసర్వేను వేగవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ రీజనల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జెడి) సిహెచ్‌విఎస్ఎన్.కుమార్ తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జరుగుతున్న రీ సర్వేకి సంబంధించిన అంశాలను ఆయన ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.

మీ ఉద్యోగ ప్రస్థానం గురించి తెలపండి.?

2007లో ఎపిపిఎస్‌సి గ్రూప్ 1 పరీక్షల్లో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని శ్రీకాకుళంలో ప్రారంభించాను. రెండేళ్ల అనంతరం తూర్పుగోదావరి జిల్లాకి బదిలీపై వచ్చాను. అనంతరం విశాఖపట్నం జిల్లాకి బదిలీ కాగా, మూడున్నర సంవత్సరాల తర్వాత అమరావతి రాజధానికి బదిలీ అయ్యి వెళ్లాను. అక్కడ మూడేళ్లు పనిచేసి ఉద్యోగోన్నతిపై రీజనల్ డిప్యూటీ డైరెక్టర్‌గా 2018లో కాకినాడ వచ్చాను. ఏడాదిన్నర పనిచేసిన తర్వాత వక్స్ బోర్డు సర్వే కమిషనర్‌గా విధులు నిర్వర్తించాను. ఆ తర్వాత సామర్లకోట సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆంధ్రప్రదేశ్ సర్వే ట్రైనింగ్ అకాడమీకి జేడీ అండ్ వైస్ ప్రిన్సిపల్‌గా పని చేసి ఇటీవల మల్టీ జోన్-1 ఆర్‌జెడిగా ఉద్యోగోన్నతి వచ్చింది. కాకినాడ కేంద్రంగా 13 జిల్లాల అధికారిగా పదోన్నతి లభించడం ఆనందంగా ఉంది. అమరావతి రాజధానిలో 33 వేలు ఎకరాల భూమిని రికార్డ్ స్థాయిలో సర్వే నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాను. దీనికి గాను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నుంచి చీఫ్ మినిస్టర్ స్టేట్ అవార్డు అందుకున్నాను.

ఫేజ్-1లో రీ సర్వే ఎంతవరకు పూర్తయింది.?

గత ప్రభుత్వం వెర్షన్ 1.0 ద్వారా రీసర్వే చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెర్షన్ 2.0 పేరుతో ఆధునిక టెక్నాలజీ ద్వారా రీ సర్వే పనులను వేగవంతంగా చేస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో మిగిలిపోయిన గ్రామాలలో రీ సర్వే పనులు చేపట్టాం. దీనిలో భాగంగా ఫేజ్ 1లో కాకినాడ జిల్లాలో 15 గ్రామాలలో సర్వే పూర్తి చేశాం. ఎపి రీ సర్వే ప్రాజెక్టు మోడల్ టెక్నాలజీ ద్వారాగా ఈ పనులను చేపట్టాం. తూర్పుగోదావరి జిల్లాలో 16 గ్రామాలకు గానూ 11 గ్రామాలలో రీ సర్వే పూర్తయింది. కోనసీమ జిల్లాలో 17 గ్రామాలకు 15 పూర్తయ్యాయి.

ఫేజ్ -2లో రీ సర్వే పనులు ఎక్కడ జరుగుతున్నాయి.?



ఫేజ్-2లో 13వ నోటిఫికేషన్ పబ్లికేషన్ ప్రకారం రీ సర్వే పనులు జరుగుతుండగా కాకినాడ జిల్లాలో 14 గ్రామాల్లో ఇప్పటికే సర్వే పనులు ప్రారంభం కాగా 2 గ్రామాల్లో పూర్తయ్యాయి. ఇంకా 12 గ్రామాలలో పూర్తి కావాల్సి ఉంది. తూర్పుగోదావరి జిల్లాలో 15 గ్రామాల్లో సర్వే పనులు ప్రారంభం కావలసి ఉంది. కోనసీమ జిల్లాలో 29 గ్రామాలకు ప్రస్తుతం ఒక గ్రామం మాత్రమే పూర్తయింది. ఇంకా 28 గ్రామాలలో సర్వే పనులు ప్రారంభం కావలసి ఉంది.

ఫేజ్-3లో గ్రామ సరిహద్దులు ఏ విధంగా నిర్ధారణ.?

ఫేజ్ 3 రీసర్వేలో గ్రామ సరిహద్దులను సర్వే చేసి కొలతలను నిర్ధారణ చేస్తున్నాము. కాకినాడ జిల్లాలో 80 గ్రామాలకు గానూ ఇప్పటికే 70 గ్రామాల్లో పూర్తయ్యాయి. తూర్పుగోదావరి జిల్లాలో 48 గ్రామాలకు గానూ ఇప్పటికే 25 గ్రామాల్లో సరిహద్దు కొలతల నిర్ధారణ జరిగింది. అలాగే కోనసీమ జిల్లాలో 105 గ్రామాలకు గాను 35 గ్రామాలను పూర్తి చేసాము. తగిన సిబ్బంది అందుబాటులోనే ఉండడం వలన రిసర్వే పనులను అనుకున్న షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయగలుగుతున్నాము. త్వరలోనే పనులు పూర్తవుతాయి.

యానాం వార్తలు



సమావేశంలో పాల్గొన్న మత్స్యకారులు, మాట్లాడుతున్న మల్లాడి కృష్ణారావు

శాంతియుత పోరాటంతోనే పరిహారం సాధన

ప్రజాశక్తి - యానాం

శాంతియుత పోరాటంతోనే పరిహారాన్ని సాధించుకోవాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ముమ్మిడివరం ఎంఎల్‌ఎ దాట్ల బుచ్చిరాజు అన్నారు. ఆదివారం స్థానిక అగ్నికుల క్షత్రియ సంక్షేమ సేవా సంఘం కల్యాణ మండపంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఒఎన్‌జిసి ఆధ్వర్యంలో ఐలాండ్ నెంబర్ 3 సమీపంలో ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్ లైన్ నుంచి ఈ నెల 22 అర్ధరాత్రి మంటలు ఎగసి పడిన సంఘటనపై చర్చించారు. ఆ సంఘటన సమయంలో తాను పుదుచ్చేరిలో ఉన్నానని సంబంధిత అధికారులకు సమాచారం అందించి స్థానిక అధికారులను పంపించి మంటలను అదుపు చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఈ ప్రభావం వల్ల తీర ప్రాంత ప్రజలతో పాటు పరిసర ప్రాంతాల అన్ని కులాల ప్రజలు కూడా తీవ్ర భయాందోళనకు గురయ్యారని అన్నారు. జరిగిన సంఘటన ఇప్పటికే పుదుచ్చేరి లెఫ్ట్‌నెంట్ గవర్నర్, ముఖ్యమంత్రికి వివరించినట్లు తెలిపారు. సంఘటన నష్టపరిహారం నష్టాన్ని యానం, ఆంధ్రప్రదేశ్ మత్స్యశాఖ అధికారులు సంయుక్త సర్వే నిర్వహించి అంచనా వేసి రిపోర్ట్ పంపించేలా పుదుచ్చేరి ప్రతినిధులు చర్యలు చేపట్టారని తెలిపారు. మరో రెండు రోజుల్లో కాకినాడ కలెక్టర్‌కి నష్టపరిహారంపై ఒక నివేదిక అందించనున్నామని తెలిపారు. అప్పటివరకు శాంతియుత పోరాటంతోనే ఈ పరిహారాన్ని సాధించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యానం, కోటిపల్లి, అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ తదితర ప్రాంతాలకు మత్స్యకార ప్రతినిధులు పాల్గొన్నారు.

వంగవీటి రంగా విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పి. మల్లవరం గ్రామంలో రంగా అభిమాన సంఘం ఆధ్వర్యంలో వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఆయన కుమారుడు రాధాకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. వైస్ ఎంపిపి ధూళిపూడి నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాధాకష్ణ మాట్లాడుతూ రంగా ఒక సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కాదని, అందరి సమస్యలపై నిరంతరం పోరాటం సాగించారని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు యువత కృషి చేయాలని కోరారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు మాట్లాడుతూ మోహన రంగా ఒక కులానికి సంబంధించిన వ్యక్తి కాదని, బడుగు బలహీన వర్గాలకు చెందిన వ్యక్తిగా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, గోదాసి నాగేశ్వరరావు, దేగల సతీష్, ఏడిద పద్దరాజు, తాడి నరసింహమూర్తి, ఉంగరాల వెంకటేశ్వరరావు, దూళజపూడి బాబి, కాటంశెట్టి రామ్మూర్తి, గుద్దేటి జిమ్మి పాల్గొన్నారు.



సభలోమాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ

ఆశా కార్యకర్త కుమార్తెకు 16వ ర్యాంకు

ప్రజాశక్తి - కరప

కరప గ్రామానికి చెందిన గెల్లా శ్వేత డిఎస్‌సిలో 16వ ర్యాంకు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. శ్వేత తల్లి రత్న కుమారి కరప పిహెచ్‌సి పరిధిలో ఆశ కార్యకర్తగా పని చేస్తున్నారు. కష్టపడి కుట్టుమిషన్, ఆశా పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంది. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులు దుర్భరంగా ఉన్నప్పటికీ చదువులో ఓర్పుతో ముందుకు సాగుతూ డిఎస్‌సి కోసం ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్దే చదివిన శ్వేత డిఎస్‌సి పరీక్షల్లో 16వ ర్యాంకు సాధించి అందరి మన్ననలు పొందారు.



గెల్లా శ్వేత

రాగంపేటలో అభివృద్ధి పనుల ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జి.రాగంపేటలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎంఎల్‌ఎ నిమ్మకాయల చినరాజప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుంగా శేఖర్‌బాబు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబు రాజు, పంచాయతీ కార్యదర్శి డి.సూర్య నారాయణ రెడ్డి, నాయకులు నూనె రామారావు, జల్దాని సుబ్రహ్మణ్యం, రేలంగి వెంకట్రావు పాల్గొన్నారు.



రిబ్బన్‌కు కట్ చేస్తున్న ఎంఎల్‌ఎ చినరాజప్ప

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

వినాయక చవితి సందర్భంగా మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వినాయకుని మట్టి ప్రతిమలను ఇంద్రపాలెం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ రకరకాల రసాయనాలతో కూడిన రంగులు, ఇనుం, నీటిలో కరగని పదార్థాలతో తయారు చేసిన వినాయక ప్రతిమలతో నీరు కలుషితం అవుతుందన్నారు. పర్యావరణం పాడవడంతో పాటు ప్రజలకు ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. కావున మట్టి వినాయకుడిని పూజించాలని వారు కోరారు.



మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

అల్లుకుపోతున్న లతలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా బస్సు స్టాప్ వద్ద విద్యుత్ స్తంభాన్ని పిచ్చి మొక్కలు, లతలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. పలు దఫాలుగా విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా జరిగే తీగలను లతలు అల్లుకుపోవడంతో ప్రమాదం సంభవించే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు అల్లుకుపోయిన లతలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



విద్యుత్ తీగలను అల్లుకుపోయిన లతలు

3న సామర్లకోట మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సెప్టెంబర్ 3వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కాదా హిమామహేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ప్రభుత్వ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.